మౌలిక వసతులు కల్పించాలి

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి
- అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు, ధరణి దరఖాస్తులు, ధాన్యం కొనుగోళ్లపై వీసీ ద్వారా సమీక్ష

కలెక్టరేట్, మే 17: పాఠశాలల ప్రారంభానికి ముందే అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా మౌలిక వసతులు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అధికారులను ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలతో చేసే అభివృద్ధి పనులు, ధరణి దరఖాస్తులు, ధాన్యం కొనుగోళ్లపై శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ, లోక్‌సభ ఎన్నికల పోలింగ్‌ను విజయవంతంగా నిర్వహించడంలో కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులు ప్రభుత్వ సిబ్బంది పోషించిన పాత్రను అభినందనీయమని కొనియాడారు. అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించేందుకు చేపట్టిన అభివృద్ధి పనులను మరో 20రోజుల్లోగా పూర్తి చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలకు అవసరమైన చోట పెయింటింగ్ పనులు చేపట్టాలని సూచించారు. విద్యార్థుల స్కూల్ యూనిఫామ్‌ల తయారీ బాధ్యతలు స్వశక్తి మహిళా సంఘాలకు అందించాలన్నారు. అలాగే మార్చి 15నుంచి ప్రత్యేక డ్రైవ్ చేపట్టి లక్షా 15వేల ధరణి పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించామన్నారు. ఎన్నికల పోలింగ్ ముగిసినందున మరోసారి ధరణి దరఖాస్తుల ప్రత్యేక డ్రైవ్ పునఃప్రారంభించాలని, మే చివరి నాటికి ధరణి పెండింగ్ దరఖాస్తులను పూర్తిస్థాయిలో పరిష్కరించాలన్నారు. దరఖాస్తుల పరిష్కారంపై తహసీల్దార్లతో సమావేశం నిర్వహించాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను మరింత వేగవంతం చేయాలన్నారు. ఐదు రోజులపాటు అకాల వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున కొనుగోలు కేంద్రాల వద్ద అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రైతులకు నష్టం కలుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వీసీకి కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్ పూజారి గౌతమి, ఖీమ్యానాయక్, ఆర్డీవోలు రమేశ్, రాజేశ్వర్, పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి జితేందర్‌రెడ్డి, పౌర సరఫరాలశాఖ మేనేజర్ జితేంద్రప్రసాద్, మార్కెటింగ్ శాఖ జిల్లా మేనేజర్ ప్రవీణ్‌రెడ్డి, డీఈవో రమేశ్‌కుమార్, అడిషనల్ డీఆర్డీవో శ్రీనివాస్, కలెక్టరేట్ పర్యవేక్షకుడు శ్రీకాంత్, తదితరులు ఉన్నారు.

వీసీకి కలెక్టరేట్ నుంచి హాజరైన కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్లు

అకాల వర్షం.. ఆగమాగం

- జిల్లా వ్యాప్తంగా ఉరుములు, మెరుపులతో వాన
- కొనుగోలు కేంద్రాల్లో తడిసిన వడ్లు
- పలు చోట్ల నేలవాలిన విద్యుత్‌స్తంభాలు, చెట్లు

వేములవాడ/బోయినపల్లి/వేములవాడ రూరల్, మే 17: అకాల వర్షం అన్నదాతను ఆగమాగం చేస్తున్నది. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా వర్షం పడగా, కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం తడిసిముద్దయింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడడంతో పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు, భారీ వృక్షాలు నేలవాలాయి. వేములవాడ పట్టణంలో ఉరుములు మెరుపులతో దాదాపు అరగంటకు పైగా 2.5సెంటీమీటర్ల వర్షం కురిసిందని గణాంకాధికారి రామకృష్ణ తెలిపారు. వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. బోయినపల్లి మండలంలోని పలు గ్రామాలు గురువారం రాత్రి అంధకారంలోనే ఉన్నాయి. ఉరుములు, మెరుపులతో భారీ వర్షం పడగా, కొదురుపాక -బోయినపల్లి ప్రధాన రహదారిలో చెట్లు విరిగి పడ్డాయి. ఎస్ఐ పృథ్వీధర్‌గౌడ్, మండల పరిషత్ అధికారులు, సిబ్బంది ఎక్సకవేటర్ సాయంతో చెట్లను తొలగించారు. దేశాయిపల్లితోపాటు పలు గ్రామాల్లో స్తంభాలు విరిగి విద్యుత్ తీగలు తెగిపోవడంతో గ్రామాల్లో అంధకారం నెలకొన్నది. విద్యుత్‌శాఖ అధికారులు శుక్రవారం మరమ్మతులు చేపటి సరఫరాను పునరుద్ధరించారు. వేములవాడ మండలం ఆరెపల్లి శివారులోని వేములవాడ-కరీంనగర్ రహదారిపై రోడ్డుకు అడ్డంగా తుమ్మ చెట్టు పడిపోవడంతో వాహనదారులు ఇబ్బందిపడ్డారు. శుక్రవారం వర్షం పడడంతోపాటు గాలి వీయగా, రోడ్డు పక్కనే ఉన్న తుమ్మచెట్టు అడ్డంగా పడిపోగా, పోలీసులు వెంటనే తొలగించడంతో వాహనాల రాకపోకలు కొనసాగాయి.

వేములవాడ: పట్టణంలోని జాతర గ్రౌండ్‌లో కురుస్తున్న వర్షం

వేములవాడ రూరల్: ఆరెపల్లి వద్ద రోడ్డుకు అడ్డంగా పడిపోయిన తుమ్మ చెట్టు

అప్రమత్తంగా ఉండాలి: ఎస్ఐలు

సిరిసిల్ల రూరల్/చందుర్తి/ఇల్లంతకుంట, మే 17: ఉరుములు, పిడుగులతో వర్షాలు పడుతున్నందున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని తంగళ్లపల్లి, చందుర్తి, ఇల్లంతకుంట ఎస్ఐలు సుధాకర్, శ్రీకాంత్, రాజు గౌడ్ సూచించారు. వర్షం పడుతున్న సమయంలో ఎవరూ కూడా చెట్ల కిందకి, బయటకు వెళ్లవద్దన్నారు. చెట్ల మీద పిడుగులు పడే అవకాశం ఎక్కువగా ఉంటుందని సూచించారు. జిల్లాలో గురువారం పిడుగుపాటు తో ఇద్దరు మృతి చెందారని తెలిపారు. ఈదురుగాలులకు విద్యుత్ తీగలు కూడా తెగి కిందపడి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. తక్షణ సహాయం కోసం వెంటనే డయల్ 100 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి
- కంచర్ల, గర్జనపల్లిలో పాఠశాలల తనిఖీ

వీర్నపల్లి: గర్జనపల్లిలో వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి, మే 17: అమ్మ ఆదర్శ పాఠశాలల కింద ఎంపిక చేసిన బడుల్లో మరమ్మతు పనులు నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులకు సూచించారు. వీర్నపల్లి మండలం కంచర్లలోని ఎంపీపీఎస్, గర్జనపల్లిలో జడ్పీ ఉన్నత పాఠశాల, ఎల్లారెడ్డిపేట మండలం దుమాల, అల్మాస్‌పూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చేపట్టిన పనులను అదనపు కలెక్టర్ పూజారి గౌతమితో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించి, మాట్లాడారు. వేసవి సెలవుల్లో పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనపై అధికారులు దృష్టిసారించాలన్నారు. తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు, విద్యుత్ సదుపాయం, పెయింటింగ్ పనులు పాఠశాలల ప్రారంభమయ్యే లోగా పూర్తి చేయాలని సూచించారు. ఇక్కడ టీఎస్ఈడబ్ల్యూఐడీసీ ఈఈ అనిత సింగనాథన్, జడ్పీ డిప్యూటీ సీఈవో గీత, డీఈవో రమేశ్‌కుమార్, డీపీవో నరేశ్‌కుమార్ ఉన్నారు.

రాయితీపై జీలుగ విత్తనాలు

గంభీరావుపేట, మే 17: గంభీరావుపేట, కొత్తపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయాల్లో పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఏవో వెంకటేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 60శాతం రాయితీ పోను 30కిలోల విత్తనాలను రూ.1,116కు అందిస్తున్నట్లు చెప్పారు. 30కిలోల విత్తనాలు రెండెకరాలకు సరిపోతాయని తెలిపారు. ఆసక్తిగల రైతులు పట్టాదారు పాస్‌బుక్, ఆధార్‌కార్డు జిరాక్స్ పత్రాలతో సంప్రదించాలని సూచించారు.

20న కబడ్డీ, వాలీబాల్ పోటీలు

ముస్తాబాద్, మే 17: పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో కబడ్డీ, వాలీబాల్ టోర్నమెంట్‌ను మండల కేంద్రంలో ఈ నెల 20న నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ శేఖర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి గ్రామం నుంచి కబడ్డీ, వాలీబాల్ పోటీలకు ఒక టీమ్‌కు మాత్రమే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు శనివారం సాయంత్రం 4గంటల లోగా టీమ్ వివరాలు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అందించాలని కోరారు. వివరాల కోసం పీసీలు శ్రీనివాస్ (98666 49293), రాజశేఖర్ (9666155150) ను సంప్రదించాలని సూచించారు.

బీఆర్ఎస్ నేతల పరామర్శ

సిరిసిల్ల రూరల్, మే 17: తంగళ్లపల్లి మండలం ఇందిరానగర్ పరిధిలోని భరత్‌నగర్‌లో రుద్రారపు చంద్రయ్య పిడుగుపాటుతో మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ నేతలు శుక్రవారం పరామర్శించారు. అదే విధంగా జిల్లెలలో బచ్చపల్లి నర్సయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఇక్కడ బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గజభీంకార్ రాజన్న, సీనియర్ నేత పడిగెల రాజు, పీఏసీఎస్ చైర్మన్ కొడూరి భాస్కర్‌గౌడ్, నాయకులు మాట్ల మధు, నాగరాజు, శంకర్ ఉన్నారు.

ఆలయంలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

రాజన్న ఆలయంలో రద్దీ

వేములవాడ టౌన్, మే 17: వేసవి సెలవుల సందర్భంగా వేములవాడ శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామివారి ఆలయం శుక్రవారం రద్దీగా కనిపించింది. వేకువజాము నుం చే భక్తులు తలనీలాలు సమర్పించి, రాజన్నకు కోడెమొక్కు చెల్లించుకున్నారు. క్యూలైన్ల ద్వారా ఆలయంలోనికి ప్రవేశించి స్వామివారిని దర్శించుకున్నారు. రాజన్నను 15 వేలమందికి పైగా భక్తులు దర్శించుకోగా, దాదాపు రూ.13లక్షలకు పైగా ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.

ఆర్థిక సాయం

ఎల్లారెడ్డిపేట, మే 17: తిమ్మాపూర్‌కు చెందిన గడ్డి రమేశ్ ఇటీవల మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ నాయకులు ఓదార్చారు. జడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు అందించిన రూ.5వేల నగదును శుక్రవారం వారు బాధిత కుటుంబ సభ్యులకు ఇచ్చారు. ఇక్కడ నాయకులు గుండ్ల రాజయ్య, బీమరి శేఖర్, బొంబోతుల అంజయ్య, లింగం నాయక్, డాకూరి రాజు, తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

ఎల్లారెడ్డిపేట, మే 17: గంభీరావుపేట మండలం నర్మాలకు చెందిన కర్రోల్ల రాజు(42) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఎస్ఐ రమాకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజు గురువారం పని మీద గొల్లపల్లికి తన బైక్‌పై వెళ్లి, రాత్రి వేళలో తిరుగు పయనమయ్యాడు. కోరుట్లపేట శివారులో బైక్ అదుపుతప్పి పొలాల్లో పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు శుక్రవారం పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

లయన్స్ మల్టికాన్ ప్రారంభం

విద్యానగర్, మే 17: తెలంగాణ, కర్నాటకలోని కొంత ప్రాంతంతో కూడుకున్న లయన్స్ ఇంటర్నేషనల్ మల్టీపుల్ జిల్లా 320 వార్షిక సమావేశం మల్టికాన్ శుక్రవారం స్థానిక ప్రతిమా హోటల్‌లో అట్టహాసంగా ప్రారంభించారు. కౌన్సిల్ చైర్మన్ తీగల మోహన్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఇంటర్నేషనల్ డైరెక్టర్ బాబూరావు, గ్యాట్ ఏరియా లీడర్ సునీల్ కుమార్ హాజరయ్యారు. మల్టీపుల్ లోని వివిధ జిల్లాల్లో జరిగిన సేవా కార్యక్రమాల సింహావలోకనం జరిగింది. జిల్లాలోని వివిధ కంటి హాస్పిటల్స్ ద్వారా అందించిన సేవలు మీల్స్ ఆన్ వీల్స్ కార్యక్రమం ద్వారా చేస్తున్న అన్నదాన కార్యక్రమ వివరాలు వెల్లడించారు. 2024-25 సంవత్సరానికి కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సమావేశం మూడు రోజుల పాటు జరుగనుండగా, చైర్మన్‌గా హన్మాండ్ల రాజిరెడ్డి, వైస్ చైర్మన్‌గా కే హరీశ్‌రెడ్డి, సెక్రటరీగా ఎన్ వెంకటేశ్వర్‌రావు, కోశాధికారిగా రేసు మల్లారెడ్డి, జాయింట్ సెక్రటరీగా శివ ప్రసాద్ ఎన్నికయ్యారు.

లయన్స్ మల్టికాన్‌ను ప్రారంభించి మాట్లాడుతున్న కౌన్సిల్ చైర్మన్ మోహన్‌రావు

మూడిళ్లలో చోరీ

ధర్మపురి/ధర్మపురి రూరల్, మే 17: ధర్మపురి మండలం నేరెళ్ల గ్రామంలో గురువారం అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. గ్రామానికి చెందిన కనికరపు మహేశ్, నరేశ్ ఇండ్లల్లో చోరీకి పాల్పడ్డారు. మహేశ్ ఇంట్లో బీరువాలో దాచిన రూ. 2.35 లక్షల నగదు, నరేశ్ ఇంట్లో దాచిన తులంన్నర బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. అలాగే, గ్రామానికి చెందిన కాసారపు రాజుగౌడ్ ఇంట్లో చొరబడి, బీరువాలో దాచిన రూ. 5 వేల నగదుతో పాటు 25 తులాల వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. మూడు కుటుంబాలు శుక్రవారం తెల్లవారుజామున నిద్రలేచి చూసేసరికి ఇంట్లో బీరువా తెరిచి ఉండడం, బట్టలు చిందరవందరగా పడి ఉండడం గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి ఎస్ఐ ఉదయ్‌కుమార్ వెళ్లి పరిశీలించారు. క్లూస్‌టీమ్ వెళ్లి ఆధారాలను సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కొనుగోళ్లలో వేగం పెంచాలి

- అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్
- రుద్రంగిలో సెంటర్ పరిశీలన

రుద్రంగిలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, అధికారులు

రుద్రంగి, మే 17: కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని వేగవంతంగా సేకరించి, వెంటనే మిల్లులకు తరలించాలని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ అధికారులకు సూచించారు. మానాలతోపాటు పలు తండాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. తడిచిన ధాన్యాన్ని పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, కొనుగోలు కేంద్రాల్లో సేకరించిన ధాన్యాన్ని తడవకుండా టర్పాలిన్లు కప్పాలని నిర్వాహకులకు సూచించారు. లారీల కొరత లేకుండా ఎప్పటికప్పుడు చూసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం రుద్రంగి రైస్‌మిల్లును పరిశీలించి లారీల్లో లోడ్ అయిన ధాన్యాన్ని తర్వగా అన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఇక్కడ జిల్లా పౌర సరఫరాల అధికారి జితేందర్‌రెడ్డి, జిల్లా పౌర సరఫరాల మేనేజర్ జితేంద్రప్రసాద్, తహసీల్దార్ శ్రీలత, నాయకులు బాదనవేని రాజారాం, ఏలేటి చిన్నారెడ్డి, ఆర్ఐ నవీన్, తదితరులు ఉన్నారు.

ధాన్యం కొనుగోళ్లు పూర్తి

సిరిసిల్ల రూరల్, మే 17: పెద్దూరులో సింగిల్‌విండో ఆధ్వర్యంలో నిర్వహించిన కొనుగోలు కేంద్రంలో ధాన్యం సేకరణ పూర్తయిందని చైర్మన్ జీల కిషన్‌యాదవ్, సీఈవో గౌరీశంకర్ తెలిపారు. శుక్రవారంతో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ పూర్తయిందని, ఇందుకు సహకరించిన రైతులు, పాలకవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు.

మృతదేహం లభ్యం

వేములవాడ రూరల్, మే17: మున్సిపల్ పరిధిలోని నాంపెల్లి శివారులో గుర్తుతెలియని మహిళా మృతదేహం కనిపించిందని వేములవాడ పోలీసులకు స్థానికులు సమాచారం అందించారు. టౌన్ సీఐ వీరప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. వేములవాడ రూరల్ మండలం ఎదురుగట్లకు చెందిన పొన్నం కవిత (35) గా గుర్తించామన్నారు. నాలుగు రోజుల క్రితం బాధిత కుటుంబ సభ్యులు ఠాణాలో ఫిర్యాదు చేశారన్నారు. చాలారోజుల క్రితం కవిత మతిస్థిమితం కోల్పోయి అనారోగ్యంతో బాధపడుతున్నదన్నారు. అప్పుడప్పుడు ఫిట్స్ వచ్చేదని, ఈ క్రమంలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేస్తున్నామని తెలిపారు.

వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న తీరును పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో సుమన్‌మోహన్‌రావు

వైద్య శిబిరాల సందర్శన

కోనరావుపేట, మే 17: ధర్మారం, సుద్దాల, కొలనూర్, మామిడిపల్లి, నిజామాబాద్, వట్టిమల్ల గ్రామాల్లో చెవి, ముక్కు, గొంతుకు సంబంధించిన వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. శిబిరంలో పలువురు వైద్య పరీక్షలు చేయించుకోగా, అవసరం ఉన్నవారికి మందులు అందజేశారు. వైద్యులు పరీక్షలు నిర్వహిస్తున్న తీరును డీఎంహెచ్‌వో సుమన్ మోహన్‌రావు తనిఖీ చేశారు. పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. ఇక్కడ వైద్యాధికారి వేణుమాధవ్, వైద్యులు శ్రీనివాస్, సుష్మ, శివరామకృష్ణ, ప్రీతి, అఖిల్, వెంకటేశ్, సూపర్‌వైజర్ శ్రీదేవి, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

ఈజీఎస్ కూలీల నిరసన

కోరుట్ల రూరల్, మే 17: తమకు పని కల్పించాలని కోరుతూ జగిత్యాల జిల్లా కోరుట్ల మండలంలోని అయిలాపూర్ గ్రామ ఉపాధిహామీ కూలీలు తహసీ ఆఫీస్ ఎదుట శుక్రవారం నిరసన తెలిపారు. గ్రామ శివారులోని నర్సింహుల కుంట, బూరుగు కుంటలో కూలీలు పూడికతీత పనులు చేపడుతున్నారు. పక్కనే ఉన్న రైతులు తమ పట్టా భూమి ఉందని, పనులు చేపట్టవద్దని అడ్డుకున్నారు. దీంతో ఉపాధి హామీ కూలీలు తహసీల్ కార్యాలయానికి వచ్చి విషయాన్ని తెలుపగా స్పందించకపోవడంతో బైఠాయించారు. తహసీల్దార్ ఇట్యాల కిషన్ స్పందించి భూమిని సర్వే చేయించి, పనులు కల్పిస్తామని హామీ ఇవ్వడంతో కూలీలు ఆందోళన విరమించారు.

యారన్ సబ్సిడీ తగ్గించడం అన్యాయం

సమావేశంలో మాట్లాడుతున్న పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్

కలెక్టరేట్, మే 17: సిరిసిల్లలోని పవర్‌లూం కార్మికుల యారన్ సబ్సిడీ తగ్గించడం అన్యాయమని.. కార్మికుల కడుపు కొట్టవద్దని.. గతంలో చెల్లించిన విధంగానే సబ్సిడీ చెల్లించాలని పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూశం రమేశ్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల బీవైనగర్ సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సబ్సిడీ అందించకుంటే 20న చేనేత జోళి శాఖ కార్యాలయం వద్ద ధర్నా చేస్తామని తెలిపారు. ఇక్క డ జిల్లా అధ్యక్షుడు కోడం రమణ, నాయకులు నక్క దేవదాస్, గుండు రమేశ్, తదితరులు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల రూరల్, మే17: జగిత్యాల జిల్లా కేంద్రంలో సేవాభారతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాల్మీకి ఆవాసంలో 2024-25 విద్యా సంవత్సరంలో రెండు నుంచి ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆవాసం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జిడిగె పురుషోత్తం, నందెల్లి మదన్‌మోహన్ రావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో తల్లిదండ్రులు లేని, ఒకరు మాత్రమే ఉన్న పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు అర్హులని తెలిపారు. ఈనెల 31వ తేదీలోగా వాల్మీకి ఆవాసంలో దరఖాస్తులు అంజేయాలన్నారు. వివరాలకు సెల్ నంబర్ల 9494431893, 99892 48893 లో సంప్రదించాలని కోరారు.

జగిత్యాల రూరల్, మే 17: జిల్లాలోని బెస్ట్ అవైలేబుల్ పాఠశాలల్లో (రెసిడెన్షియల్ అండ్ నాన్ రెసిడెన్షియల్) 2024-25 విద్యా సంవత్సరంలో ప్రవేశానికి షెడ్యూల్డ్ కులాల విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రాజ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒకటో తరగతిలో 75, ఐదో తరగతిలో 76 సీట్లు ఉన్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల వారి వార్షికాదాయం రూ. 1.50 లక్షల్లోపు, పట్టణ ప్రాంతాల వారికి రూ. 2 లక్షల్లోపు ఉండాలని పేర్కొన్నారు. ఈనెల 18వ తేదీ నుంచి జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయంలో దరఖాస్తుతో పాటు కులం, ఆదాయం, నివాసం, రేషన్‌కార్డు, జనన ధ్రువీకరణ, ఆధార్‌కార్డు జిరాక్స్ ప్రతులను జత చేసి అందజేయాలని తెలిపారు. వివరాలకు సెల్ నంబర్ 63028 82400లో సంప్రదించాలని పేర్కొన్నారు.

జ్యోతిష్మతి విద్యార్థులకు లుసియానా టెక్ యూనివర్సిటీ వెబినార్

తిమ్మాపూర్ రూరల్, మే 17: అమెరికాలో ఉన్నత విద్యకు సంబంధించి మండలంలోని జ్యోతిష్మతి అటానమస్ ఇంజినీరింగ్ కళాశాల అమెరికాలోని లూసియానా టెక్ యూనివర్సిటీ ఇటీవల అవగాహన ఒప్పందం కుదుర్చుకున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా శుక్రవారం జ్యోతిష్మతి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు లూసియానా యూనివర్సిటీ ఇంటర్నేషనల్ ఎఫైర్స్ డైరెక్టర్ జె.ఆర్.లిగాన్, లూసియాన టెక్ యూనివర్సిటీ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ ఫర్ రీసెర్చ్ డీన్ ఆఫ్ గ్రాడ్యుయేట్ స్కూల్ ప్రొఫెసర్ బి.రాము రామచంద్రన్ ఎం.ఎస్. కోర్స్ అడ్మిషన్స్‌పై వెబినార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంజినీరింగ్ విద్యార్థులు ఉన్నత విద్యలో భాగంగా అడ్మిషన్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, స్కాలర్‌షిప్స్, ప్రాంగణ నియామకాలు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. సెప్టెంబర్, ఫిబ్రవరిలో నిర్వహించే అడ్మిషన్ల ప్రక్రియకు సన్నద్ధం కావాలని విద్యార్థులకు సూచించారు. ఏజెంట్లను సంప్రదించి ఇబ్బందుల్లో పడకుండా విద్యార్థులు అమెరికాలో సులువుగా ఉన్నత విద్యను అభ్యసించేలా జ్యోతిష్మతి అటానమస్ ఇంజినీరింగ్ కళాశాల, అమెరికాలోని లూసియానా టెక్ యూనివర్సిటీతో అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు తెలిపారు. అమెరికాలో 1894లో స్థాపించిన లూసియానా టెక్ యూనివర్సిటీ ఇంజినీరింగ్, సైన్స్, వ్యాపార కార్యక్రమాలకు ప్రసిద్ధి చెందిందని వెల్లడించారు. కార్యక్రమంలో జ్యోతిష్మతి అటానమస్ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు, కరస్పాండెంట్ సెక్రటరీ జువ్వాడి సుమిత్ సాయి, ప్రిన్సిపాల్ డాక్టర్ కే శ్రీనివాసరావు, డీన్ అకాడమిక్స్ పి.కె. వైశాలి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అధిక రక్తపోటుతోనే అనర్థాలు

విద్యానగర్, మే 17: అధిక రక్తపోటుతో అనర్థాలు వస్తాయని డీఎంహెచ్‌వో సుజాత తెలిపారు. శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో ప్రపంచ అధిక రక్తపోటు దినోత్సవం సందర్భంగా డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఇండియా, న్యూఢిల్లీ నుంచి వెబినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అధి క రక్తపోటు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నెల రోజుల పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. 30 సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్కరూ ఎప్పటికప్పుడు రక్తపరీక్షలు చేసుకొని ఆరోగ్యంగా ఉండాలన్నారు. తలనొప్పి, దృష్టి లోపం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, అలసట, గుండె వేగంగా కొట్టుకోవడం లాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలోని ఆరోగ్య కేంద్రాలకు వెళ్లాలని సూచించారు. గుండెపోటు, పక్షవాతం, మూత్ర పిండాల వ్యాధులకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమతుల్యమైన ఆహారం తీసుకుని రోజుకు కనీసం 30నుంచి 60నిమిషాల వరకు యోగా, నడక, మెడిటేషన్ దినచర్యలో భాగంగా చేసుకోవాలన్నారు.

పిల్లలను క్రీడల్లోనూ ప్రోత్సహించాలి

రాంనగర్, మే 17: చదువుతో పాటు క్రీడల్లో కూడా పిల్లలను ప్రోత్సహించాలని కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి తల్లిదండ్రులకు సూచించారు. కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ కేంద్రంలోని జాన్ విల్సన్ ఓపెన్ ఎయిర్ థియేటర్‌లో పోలీస్ సిబ్బంది పిల్లలకు వేసవి సెలవుల సందర్భంగా సమ్మర్ క్యాంపును శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, క్యాంపు రెండు వారాల పాటు కొనసాగుతుందని తెలిపారు. ఇందులో భాగంగా పిల్లలకు డ్రాయింగ్, పెయింటింగ్, డ్యాన్స్, సింగింగ్, అథ్లెటిక్స్, కరాటే, ఫుట్‌బాల్, క్రికెట్ వంటి వాటిల్లో శిక్షణ ఇప్పించనున్నామని చెప్పారు. ఇందు కోసం సుశిక్షితులైన టీచర్లు, కోచ్‌లను నియమించామన్నారు. క్రీడల్లో పాల్గొనడం వల్ల పిల్లల్లో మానసికోల్లాసం, శారీరక దృఢత్వంతో పాటు ఆత్మవిశ్వాసం పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ (శాంతి భద్రతలు) ఏ లక్ష్మీనారాయణ, రిజర్వు ఇన్‌స్పెక్టర్లు సురేశ్, శ్రీధర్‌రెడ్డితో పాటు టీ